JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 17-03-2026

Medchal - Malkajgiri | Tuesday 17-03-2026

Follow: jayabherinews

సంపుటి : 02 | సంచిక : 290

పేజీలు : 8 | వెల : 5

Vol. 02 | Issue 290 | Pages : 8 | ₹: 5



విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889

call me

jayabheripaper@gmail.com






## తెలంగాణ జాతి గౌరవం

శాసనసభ ప్రాంగణంలో.. తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి నిలువెత్తు ప్రతిబింబంగా, అస్తిత్వం, సంస్కృతికి ప్రతిరూపమైన శక్తి స్వరూపిణి "తెలంగాణ తల్లి" విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి గవర్నర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రితో కలిసి గవర్నర్ అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు.



## సాహిత్య అకాడమీ 2025 పురస్కారం

తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి రాసిన "అనిమేష" కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## మర్యాదపూర్వకంగా భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భారత ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్ర ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు సుబ్రమణియన్ ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు.

అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యుత్ రంగం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, జీఎస్టీ విభాగాల్లో నమూనా మూల్యాంకనం, జీఎస్టీలో పన్నుల అంచనా, తదితర అంశాలపై సుబ్రమణియన్ తో చర్చించారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకుని ప్రణాళికా బద్ధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు.



# రైజింగ్ దిశగా అడుగులేస్తున్న తెలంగాణ

*తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, ఆశయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.*

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవరూ ఆపలేరు
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోంది
- ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిహెచ్ఎంసి విభజన
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తొలి ప్రసంగం

**జయభేరి, హైదరాబాద్ :**

బడ్జెట్ సమావేశాలకు హాజరైన సభ్యులందరికీ గవర్నర్ హృదయపూర్వక స్వాగతం పలుకుతూ... "ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు సాగుతున్నాం. అందుకోసం బలమైన పునాదులు వేసేందుకు ఏడాది కాలంలో ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. సమున్నతమైన ఆశయంతో 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి గడిచిన రెండేండ్లుగా ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలు అమలు చేసింది.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా అంచెలంచెలుగా వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరించింది. ...మిగతాది 2 లో

# ఆంధ్రాకు దాసోహమైన ముఖ్యమంత్రి రేవంత్

- కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం
- చోద్యం చూస్తున్న కాంగ్రెస్ సర్కార్
- కుట్రలు చేస్తున్న ఏపీ, కేంద్ర ప్రభుత్వాలు
- ఢిల్లీ మీటింగ్ మినిట్స్ వచ్చి నెల దాటినా రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదు?
- మొద్దు నిద్ర వీడి నీటి హక్కులను కాపాడాలి.. లేఖల డ్రామాలు కట్టిపెట్టాలి



**జయభేరి, హైదరాబాద్ :**

అసెంబ్లీ మీడియా హాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు చెరిగారు. చేతకాని, బాధ్యతలేని, ముందుచూపు లేని రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరి వల్ల కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, రాష్ట్ర ప్రయోజనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెట్టారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ...మిగతాది 2 లో


# రైతులకు వెన్నుపోటు రాహుల్‌కు వెయ్యి కోట్లా..

- రెండున్నరేళ్లు వుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదు
- ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం
- అసెంబ్లీలో నిలదీస్తామన్న కేటీఆర్



**హైదరాబాద్ :**

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ...మిగతాది 2 లో



# నో టాలరెన్స్..

## తప్పు చేస్తే శిక్ష తప్పదు.!

- పుట్టా మహేష్ డ్రగ్స్ వ్యవహారం పై సీఎం చంద్రబాబు సీరియస్

**విజయవాడ, మార్చి 16 :**

నో టాలరెన్స్.. ఇది ఏపీ సీఎం చంద్రబాబు తమ నాయకులకు తరచూ చెప్పిన మాట. జనంలో ఉండండి. జనం మాట వినండి .జనంతోనే నడవండి. అంటూ సందేశమిస్తూనే, నాయకులు పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే మాత్రం ఊరుకోనని గతంలోనే హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఘటన టీడీపీలో కలకలం రేపింది. వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ పార్టీ వ్యవహారం రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. అర్ధరాత్రి నిర్వహించిన యాంటీ నార్కోటిక్స్ దాడిలో పలువురు ప్రముఖులు పట్టుబడగా... వారిలో ఎలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పేరు బయటకు రావడం సంచలనంగా మారింది. టెస్టులో డ్రగ్స్ పాజిటివ్ రావడంతో టీడీపీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతుండగానే టీడీపీ స్పష్టమైన సందేశం ఇచ్చింది. డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలగకూడదన్న ఉద్దేశంతో పుట్టా మహేష్‌ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని ...మిగతాది 2 లో

# చాక్లెట్ చూపించి.. చిన్నారిపై అత్యాచారం



**హైదరాబాద్, మార్చి 16 :**

హైదరాబాద్ శివార్లలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఒక ఆరేళ్ల అభం శుభం తెలియని బాలికపై కామాంధుడు అఘాయిత్యానికి పాల్పడి, ఆపై చిన్నారిని హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ నమ్మించి ఆ చిన్నారిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బలవంతంగా అత్యాచారం చేశాడు. తన గురించి చెబుతుందని పాపను హత్య చేశాడు. ఆదివారం సాయంత్రం నుండి బాలిక కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు రాత్రి 10 గంటల సమయంలో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ...మిగతాది 2 లో

# కొత్త పన్నుల కోసం ప్రయత్నాలు

- సెక్షన్ 301 అంటే ఏమిటి?
- 16 దేశాలపై మరోసారి ఫోకస్ చేసిన ట్రంప్!



**చెన్నై, మార్చి 16 :**

అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ భారత్, చైనా, బంగ్లాదేశ్ సహా 16 ప్రధాన వాణిజ్య భాగస్వాములపై కొత్త ఎంక్వయిరీ ప్రారంభించింది. ఈ దర్యాప్తును యుఎస్ వాణిజ్య చట్టం 1974లోని సెక్షన్ 301 కింద నిర్వహిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం, అమెరికా ఏ దేశంపైనా టారిఫ్స్ లేదా దిగుమతి పన్నులను పెంచవచ్చు. గత నెలలో యుఎస్ సుప్రీంకోర్టు ట్రంప్ పరిపాలన విధించిన సుంకాలను చట్టవిరుద్ధమని ప్రకటించి వాటిని కొట్టివేసిన తర్వాత ఈ చర్య వచ్చింది. దీని తరువాత, యుఎస్ ఇప్పుడు కొత్త దర్యాప్తు ద్వారా మళ్ళీ ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దర్యాప్తులో అవకతవకలు బయటపడితే, అనేక దేశాలపై కొత్త సుంకాలు విధించే అవకాశం ఉందని అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ అన్నారు. ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## చాక్లెట్ చూపించి..

కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించగా, ఒక వ్యక్తి బాలికను తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. ఆ ఆధారాలతో పోలీసులు నిందితుడిని వేగంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించి, అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో బాలిక మృతదేహం ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి చూపించాడు. పోలీసులు నిందితుడిపై అత్యాచారం, హత్య సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్ ఆశ చూపించి తీసుకెళ్లి హత్యాచారం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి బంధువులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులను సమాజంలో బతకనివ్వొద్దని, ఉరితీసి చంపాలని డిమాండ్లు వస్తున్నాయి.

## కొత్త పన్నుల కోసం ప్రయత్నాలు

దీని ప్రభావం పడే దేశాలలో చైనా, యూరోపియన్ యూనియన్, భారత్, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో ఉన్నాయి. ఈ దర్యాప్తు అధిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న దేశాలను లేదా అమెరికాకు వస్తువులను విక్రయించే దేశాలను లక్ష్యంగా చేసుకుంది. ఇది దేశీయ పరిశ్రమలకు ఇబ్బంది కలిగిస్తుందని అమెరికా చెబుతోంది.దర్యాప్తులో చేర్చిన ఇతర దేశాల్లో తైవాన్, వియత్నాం, థాయిలాండ్, మలేషియా, కంబోడియా, సింగపూర్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, స్విట్జర్లాండ్, నార్వే ఉన్నాయి. అమెరికా రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన కెనడాను మాత్రం ఈ జాబితాలో చేర్చలేదు. ఈ దర్యాప్తు 60 కంటే ఎక్కువ దేశాలను కవర్ చేయనుంది.గతంలో, చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతం నుంచి దిగుమతి అయ్యే సౌర ఫలకాలు, ఇతర ఉత్పత్తులపై అమెరికా చర్య తీసుకుంది. ఈ చర్య ఉయ్ఘర్ ఫోర్స్డ్ లేబర్ ప్రొటెక్షన్ చట్టం కింద తీసుకుంది, ఇది మాజీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలనలో ఆమోదించారు. చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతంలో ఉయ్ఘర్ ముస్లిం కమ్యూనిటీ సభ్యులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అమెరికా ఆరోపిస్తోంది. అయితే, చైనా ఈ ఆరోపణలను ఖండిస్తూనే ఉంది. ఈ దర్యాప్తు త్వరగా పూర్తి అయ్యేందుకు గడువు విధించారు. ఏప్రిల్ 15 వరకు అభిప్రాయాలను తీసుకుంటుంది. మే 5వ తేదీ నాటికి బహిరంగ విచారణ జరుగుతుంది. ఆ తర్వాత జూలై నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. US వాణిజ్య లోటును తగ్గించి, దేశీయ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్యను ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చెబుతోంది.

**సెక్షన్ 301 అంటే ఏమిటి?**

1974 నాటి US వాణిజ్య చట్టంలో సెక్షన్ 301 ఒక కీలకమైన భాగం. ఏదైనా దేశం అన్యాయమైన లేదా చట్ట వ్యతిరేక వాణిజ్య పద్ధతుల్లో వ్యాపారం చేస్తుందని US విశ్వసించినప్పుడు ఈ చట్టం ప్రయోగిస్తుంది. ఈ చట్టం ప్రకారం, US ఆ దేశంపై దర్యాప్తు ప్రారంభించవచ్చు. అవసరమైతే, సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులను విధించవచ్చు. ఈ చట్టం ప్రకారం, US ప్రభుత్వ వాణిజ్య విభాగం అయిన యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం ఒక దేశ వాణిజ్య విధానాలను పరిశీలిస్తుంది.

## నో టాలరెన్స్..

ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ క్రమశిక్షణ విషయంలో మాత్రం రాజీ ఉండదన్న సంకేతాన్ని చంద్రబాబు మరోసారి యాక్షన్‌లో చూపించారు. ఈ వ్యవహారంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అధికారికంగా షోకాజ్ నోటీసు జారీ చేశారు. డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్నట్టు వచ్చిన సమాచారం నేపథ్యంలో ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేశారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రవర్తన ఏదైనా జరిగితే కఠిన చర్యలు తప్పవని కూడా అందులో పేర్కొన్నారు. రాజకీయంగా ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా... పార్టీ నియమాలు అందరికీ ఒకటేనన్న సందేశం ఇవ్వడమే లక్ష్యంగా టీడీపీ అధిష్ఠానం ఈనిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే తానెలాంటి తప్పుచేయలేదంటున్నారు పుట్టమా మహేష్. గతంలో కూడా వివాదాల్లో ఇరుక్కున్న నేతలపై చంద్రబాబు కఠిన చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. వ్యక్తిగతంగా ఎంత దగ్గర నాయకులైనా... పార్టీ ప్రతిష్ఠకు మచ్చ పడితే చర్యలు తప్పవని ఆయన పలుమార్లు ప్రకటించారు.

గతంలో లైంగిక వేధింపుల ఆరోపణలతో వివాదంలో ఇరుక్కున్న కోనేటి ఆదిమూలం వ్యవహారం కూడా అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆరోపణలు వెలుగులోకి వచ్చిన వెంటనే పార్టీ కార్యకలాపాల నుంచి ఆయనను దూరంగా ఉంచారు. ప్రస్తుతం పుట్టామహేష్ అంశంపై విపక్షాలు విమర్శలతో విరుచుకుపడుతున్నాయి. వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. మరి చూడాలి పుట్టా వివరణ తర్వాత టీడీపీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## ఆంధ్రాకు దాసోహమైన ముఖ్యమంత్రి రేవంత్

ఆయన మాట్లాడుతూ.. నీటి హక్కుల సాధనలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆధారాలతో సహా ఎండగట్టారు. కాంగ్రెస్ మొద్దు నిద్రను వదిలించేందుకే బీఆర్ఎస్ పక్షాన పదేపదే నిలదీస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. మరి తెలంగాణ గవర్నర్ స్పీచ్‌లో.. నల్లమల్ల సాగర్‌ను అడ్డుకుంటామని, గోదావరిలో చుక్క నీటిని కూడా వదులుకోమని ఈ ప్రభుత్వం ఎందుకు చెప్పించలేకపోయింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఢిల్లీ మీటింగ్ మినిట్స్‌పైనా స్పందించదు. గవర్నర్ ప్రసంగంపైనా మాట్లాడదు. కృష్ణాలో 80 శాతం నీళ్లను ఏపీ తరలించుకుపోతున్నా నోరు మెదపరు. కృష్ణాతో పాటు గోదావరి నీళ్లను కూడా ఏపీ దోచుకుపోకుండా ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి వెంటనే ఆ మీటింగ్ మినిట్స్‌పై గట్టిగా అభ్యంతరం తెలపాలి. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు గతంలో చంద్రబాబు ఎన్ని కుట్రలు చేశారో, ఎన్ని లేఖలు రాశారో రాష్ట్ర ప్రజలకు తెలుసు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

## రైతులకు వెన్నుపోటు

ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు, రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని, రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

# 5 రాష్ట్రాల్లో గెలుపు ఎవరిది..?

దేశంలో ఎన్నికల సందడి మొదలైంది. కీలకమైన నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది.ఈ ఐదు ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అస్సాంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం , పుదుచ్చేరిలలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది.




ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి.ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోదీ గా మారింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన పదేళ్ల సంక్షేమ పథకాలు ,బెంగాలీ అస్మితను నమ్ముకోగా, బీజేపీ అవినీతి , ప్రజల అసంతృప్తిని ప్రధాన అస్త్రాలుగా చేసుకుని బరిలోకి దిగుతోంది. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో, బెంగాల్ గడ్డపై హోరాహోరీ పోరు తప్పేలా లేదు. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తలకిందులు చేసే అవకాశం ఉంది.దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అధికార డీఎంకే కూటమి పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, సూపర్ స్టార్ విజయ్ రాజకీయ ప్రవేశం తమిళగ వెట్రి కజగం రూపంలో కొత్త సవాలును విసిరింది. అన్నాడీఎంకే తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, విజయ్ రాకతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది. విజయ్ వైపు మళ్లుతున్న యువత ఓట్లు ఎవరి గెలుపును అడ్డుకుంటాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

పుదుచ్చేరిలో కూడా ఇదే విధమైన కూటముల పోరు సాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉన్నాయి.సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. బిజెపి ఇక్కడ బలమైన మూడో శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. త్రిముఖ పోటీ జరిగే కొన్ని నియోజకవర్గాల్లో బిజెపి ఓట్లు ఎవరిని ముంచుతాయో అన్నది కీలకం.అస్సాంలో ప్రధాన పోటీ బిజెపి , కాంగ్రెస్ మధ్యే ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ సారథ్యంలో బిజెపి ధీమాగా ఉంది. మహాజోత్ కూటమి విచ్ఛిన్నం కావడం బిజెపికి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ తన వ్యక్తిగత చరిష్మాతో బిజెపికి గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, అభివృద్ధి మంత్రం , హిందూత్వ కార్డుతో బిజెపి పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి.

ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో ప్రాంతీయ పార్టీల పట్టు నిలుస్తుందా? లేదా జాతీయ పార్టీలు తమ ప్రభావం చూపిస్తాయా? అన్నది మే నెలలో తేలనుంది. తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం , పుదుచ్చేరి శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో ముగియనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈసీ ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది.అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికల వివరాలు:పశ్చిమ బెంగాల్‌లో వరుసగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఈసారి వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ బలమైన ప్రతిపక్షంగా అవతరించడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత మార్పులు మమతా బెనర్జీకి పెద్ద సవాలుగా మారాయి. అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలు, శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు దీదీకి మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? లేక సంక్షేమ పథకాలతో మమత మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది వేచి చూడాలి.తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై ప్రజల స్పందన మిశ్రమంగా కనిపిస్తోంది. ధరల పెరుగుదల, మౌలిక సదుపాయాల కొరత, మరియు కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలు స్టాలిన్ సర్కార్‌కు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులు, మిత్రపక్షాల ఒత్తిడి మరియు బీజేపీ వంటి జాతీయ పార్టీల విస్తరణ స్టాలిన్ ఓటు బ్యాంకుకు ఎంతవరకు గండి కొడుతుందనేది కీలకం. సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న భారీ వ్యయం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి.ఈ ఇద్దరు దిగ్గజ నాయకులు తమ పట్టును నిలబెట్టుకుంటారా లేక ఓటమిని మూటగట్టుకుంటారా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, ఓటర్ల నాడి వేరుగా ఉంటుంది. సంక్షేమ పథకాలపై నమ్మకమా? లేక పరిపాలనలో మార్పు కోరుకుంటున్నారా? అన్నది మే 4న వెల్లడి కానుంది.




## క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ

జయభేరి, హైదరాబాద్ :

డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ తో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం, దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని, క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలోగ్గవద్దని ఈ సందర్భంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. 2 BHK, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి అధికారులు నోటీసులు జారీ చేసి, నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలి, నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించడం జరిగింది. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లోముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని అధికారులకు సూచించాము. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా.. పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్దిదారులకు కేటాయించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ, వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైజింగ్ దిశగా అడుగులేస్తున్న తెలంగాణ

వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం, పౌర సేవలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పునర్వవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. దీనికి తోడుగా కోర్ అర్బన్ రీజియన్‌లో హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వవస్థీకరించాం. అలాగే కోర్ అర్బన్ ప్రాంతంలో సరస్సులు, చెరువులు, ట్యాంకులను పునరుద్ధరించడానికి ప్రజా ప్రభుత్వం నడుం బిగించింది. హైడ్రా ఏర్పాటు ద్వారా దాదాపు 60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుంది. ఆధునాతన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో 55 కి.మీ. మేరకు మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును చేపట్టింది. ఔటర్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న ప్రాంతంలో (పెరిఅర్బన్ రీజియన్) మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎకోఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్ కంపెనీలతో మౌలిక సదుపాయాల హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత కీలక గమ్యస్థానంగా నిలిచింది. ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సమ్మిట్ నిర్వహించడమే కాకుండా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు వివిధ రంగాల్లోని ప్రముఖులతో రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించింది. ఎగుమతుల్లో దేశంలోనే 7వ స్థానంలో తెలంగాణ నిలిచింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, నెట్ జీరో ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానంగా రేడియల్ రోడ్లు, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పూణె నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లతో రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుంది. తెలంగాణ పురోభివృద్ధికి 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ కోసం దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇంధన రంగంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 23,187 మె.వా. పెరిగింది. ఇందులో 44.55 శాతం పునరుత్పాదక వనరుల నుంచి రావడం ప్రశంసనీయం.రైతులను వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను చేపట్టింది. 20,616 కోట్ల రూపాయల పంట రుణాల మాఫీ, సన్నరకం వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్, పెట్టుబడి సహాయంగా రైతు భరోసా, గిట్టుబాటు ధరలకు ధాన్యం సేకరణ, సౌర శక్తితో నడిచే పంప్ సెట్లకు తీసుకుంటున్న చర్యలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది.

భూమి సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారానికి తెలంగాణ భూ భారతి చట్టం అమలులోకి తేవడమే కాకుండా సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస ప్రక్రియను కొన్ని నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించాలని ప్రతి కుటుంబానికి సంక్షేమంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టింది. కొన్నేండ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాలకు 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేసింది. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి ప్రతి లబ్దిదారుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోంది. రూ. 22,500 కోట్లతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నాం. మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక బృందాలను వ్యాపారస్తులుగా మార్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే మహత్తర చర్యలతో ముందుకు వెళుతున్నాం. మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం కోసం ఇప్పటివరకు 269.68 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా, తద్వారా రూ. 9,222 కోట్లకు పైగా మహిళలు ఆదా చేసుకున్నారు. మహాలక్ష్మి పథకంలో 42.90 లక్షల కుటుంబాలకు సబ్సిడీపై రూ. 500 లకు ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నాం. గృహజ్యోతి కింద పేదల గృహాలకు 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న కార్యక్రమం వల్ల 53.09 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి. విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టి నూతన విద్యా విధానానికి కమిటీని ఏర్పాటు చేసింది. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో డైట్, కాస్మెటిక్ ఛార్జీలను 212 శాతం పెంచాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోంది. యువతలో నైపుణ్యతను పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ స్థాపించడం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను ఏటీసీలుగా మార్చడం జరిగింది. రాష్ట్రంలో పేద కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న లక్ష్యంతో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోంది. వైద్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి 11 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా కొత్త ఆసుపత్రి నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం వంటివి ఈ ఏడాది చివరి నాటికి సేవలను అందుబాటులోకి తేవాలన్న కృతనిశ్చయంతో ఉంది. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకెళ్లడానికి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణను ప్రారంభించింది. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాడనికి ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తోంది. ప్రజావాణిలో ఇప్పటివరకు 64,697 అర్జీలు అందగా, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 47,670 విజ్ఞప్తులను పరిష్కరించాం. సామాజిక న్యాయమే లక్ష్యంగా, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించాం. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో ముందడుగు వేసి 59 ఎస్సీ కులాలను రిజర్వేషన్ వర్గీకరణ పూర్తి చేసింది. మాదక ద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి కల్పించాలన్న దృఢనిశ్చయంతో ఈగల్ ఏర్పాటు చేశాం. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం పీఎస్సీని పునరుద్ధరించడమే కాకుండా రికార్డు సమయంలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. సినిమా రంగంలో ప్రతిభను గుర్తించడానికి గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రారంభం, తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ సంరక్షణలో భాగంగా దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పుణ్య క్షేత్రాల అభివృద్ధి, వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. తెలంగాణ రాష్ట్రం ఒక చారిత్రక మార్పు దశలో నిలబడింది. ప్రజా ప్రభుత్వం ఎంచుకునే ప్రతి పాలసీ, అమలు చేసే ప్రతి కార్యక్రమం, చేపడుతున్న ప్రతి సంస్కరణ ఈ ప్రాంత ప్రజలకు అవకాశాలను సృష్టిస్తుంది. సమ్మిళిత వృద్ధి దిశగా వారిని నడిపించి మరింత శక్తివంతులుగా తయారు చేస్తుంది. రాష్ట్ర సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధిపై ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉంది. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవరూ ఆపలేరు" అని అన్నారు.

# కాప్రా తాసిల్దార్ కు బిజెపి నాయకుల వినతిపత్రం

**జయభేరి, జవహర్ నగర్ :**



జవహర్ నగర్ బిజెపి అధ్యక్షుడు కళికోట కమలాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ కాప్రా ఎమ్మార్వోకు సోమవారం వినతి పత్రం సమర్పించడం జరుగింది. ఈ సంధర్భంగా కమలాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్రరావు మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ ల పిలుపుమేరకు వినతి పత్రం తహసిల్దార్ కు అందజేయడం జరిగిందని విన్నవిస్తూ ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చి, అధికారం దక్కగానే ప్రజల నమ్మకాలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. 100 రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం అని ప్రగల్భాలు పలికిన ఆరు గ్యారంటీలు నేడు రెండు సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు, మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ 2,500 ఇస్తామని చెప్పి నేటికీ ఆ ఊసే ఎత్తకుండా మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఎకరాకు రూ 15,000 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని రైతులను నమ్మించి, పాత పథకాలను కూడా సరిగా అమలు చేయలేదని ఐదు లక్షల విద్యార్థులకు భరోసా కార్డులు, నిరుద్యోగ భృతి వంటి హామీలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని 500 రూపాయలకే సిలిండర్ మరియు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అరకొరగా అమలు చేస్తూ, నిబంధనల పేరుతో లక్షలాది మంది అర్హులను జాబితా నుండి తొలగించడం దారుణం అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఆర్థిక ఇబ్బందుల నెపాన్ని గత ప్రభుత్వంపై నెట్టడం హాస్యాస్పదం అని ఎద్దేవ చేశారు హామీలు ఇచ్చేముందు లేని ఆర్థిక అవగాహన ఇప్పుడు ఎందుకు తలెత్తిందో ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని తక్షణమే పెండింగ్‌లో ఉన్న అన్ని గ్యారంటీలను బేషరతుగా అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు ఈకార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం నాయకులు సంతోష్ గుప్తా, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్ యాదవ్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు మరాఠి బాబు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లిఖిత యాదవ్, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, జవహర్ నగర్ మాజీ బీజేవైఎం అధ్యక్షులు రామ్ నాయక్, బిజెపి ఉపాధ్యక్షురాలు వనబోజు రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శులు వేపుల సన్నీ, ముచ్చర్ల యాదగిరి , బీజేవైఎం అధ్యక్షులు సందీప్ ముదిరాజ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు కొంపెల్ల చంద్రశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు చింతంరెడ్డి లక్ష్మీ దేవి, పానుగంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కానిస్టేబుల్ హత్య కేసు



- ఇద్దరు నిందితుల అరెస్టు

**జయభేరి, ఉప్పల్ :**

చిలకనగర్ హత్య కేసును 8 గంటల్లో ఉప్పల్ పోలీసులు ఛేదించారు. ఉప్పల్ లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం రాత్రి 8 సమయంలో 100 కాల్ ద్వారా సమాచారం వచ్చింది. చిలకనగర్ ప్రాంతంలో పారువుల సుధీర్ కుమార్ను కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం వచ్చింది. సుధీర్ కుమార్ ను హత్య చేసిన ప్రధాన నిందితుడు బనోతు సంతోష్ లు 7సంవత్సరాలుగా స్నేహితులు. వీరి మధ్య మూడు రోజుక క్రితం నుండి విభేదాలు ఏర్పడ్డాయని అన్నారు. మార్చి 15న సాయంత్రం సమయంలో సంతోష్ తన స్నేహితుడు పొడిశెట్టి తరుణ్తో కలిసి సుధీర్ కుమార్ను చిలకనగర్ గ్రౌండ్ వద్దకు పిలిచారు. సుధీర్ తన స్నేహితుడు ఇమ్రాన్ ఖాన్తో కలిసి అక్కడికి వెళ్లిన తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో సంతోష్ కత్తితో సుధీర్పై దాడి చేయాగా, సంతోష్ పారిపోవడానికి తరుణ్ తోడయ్యాడు. సుధీర్ అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ సంతోష్ వెంబడించి పలుమార్లు కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, కేవలం 8 గంటల్లోనే ప్రధాన నిందితుడు బనోతు సంతోష్, అతని సహచరుడు పొడిశెట్టి తరుణ్ను అదుపులోకి తీసుకున్నాము. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక యాక్టివా మోటార్ సైకిల్, వారి దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- చైర్మన్ జాం రవి

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 16:**



వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జాం రవి అధ్యక్షతన మొదటి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అదేవిదంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయం అవుతూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ లోని అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ముడుచింతలపల్లి మున్సిపాలిటీ గౌరవ చైర్మన్ జాం రవి అధ్యక్షతన మొదటి కౌన్సిల్ మీటింగ్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. గౌరవ చైర్మన్ జాం రవి మాట్లాడుతూ రాబోయే రోజులలో వేసవికాలం కాబట్టి నీటి ఎదట లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా డ్రైనేజీ, పారిశుధ్యం, ఇతర అంశాల గురించి సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మోర్సుబాయ్ శశిరేఖ , కమిషనర్ పవన్ కుమార్, మరియు కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్,మూడవత్ నవీన్ నాయక్ ,ముద్దం పాపిరెడ్డి, వంగ ప్రియాంకరెడ్డి, చిన్న లచ్చ సరిత , గిరిపల్లి రమేష్,గిరిపల్లి జ్యోతి, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీలత, దోసకాయల లత, రాజీగాళ్ల లత, పులి ప్రభాకర్, ఆది అజయ్ కుమార్, కొంపల్లి మాధవి, మ్యాడ బోయిన మౌనిక, కొల్లాస్ రాజు, చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, గూడ జంగారెడ్డి, గొంది శ్రావణి, బొమ్మలపల్లి మల్లేష్,గుండ్లపల్లి మహేశ్వరి, ఎర్ర స్వప్న, మరియు ఆర్వో హర్షద్, మేనేజర్ ఉషా, ఆర్ ఐ లు రాజేశ్వర్ రెడ్డి & గౌతమి, స్ఫూర్తి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటాం

**జయభేరి, సిద్దిపేట :**

రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయం లోని మీటింగ్ హాల్ లో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న జగదేవ్ పూర్ మండలం చెబర్తి, అల్రాజీపేట, పిర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిటరేషన్ ప్రక్రియ గూర్చి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామం. మీప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసిల్దార్ నిర్మల తదితరులు ఉన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళ భుజం నుండి 750 గ్రాముల ట్యూమర్ తొలగింపు
- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

**జయభేరి, గజ్వేల్, 16 మార్చి :**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచారు. గజ్వేల్ పట్టణానికి చెందిన జ్యోతి (32) భర్త హనుమంతు అనే మహిళ గత కొంతకాలంగా కుడి భుజంపై పెద్ద కణితి (ట్యూమర్) సమస్యతో బాధపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆమె, ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకునే స్తోమత లేక గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. రోగి పరిస్థితిని గమనించిన వైద్యులు వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఒక బృందంగా ఏర్పడిన వైద్యులు సుమారు 750 గ్రాముల బరువున్న భారీ ట్యూమర్‌ను (నియోప్లాజమ్) విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటున్నారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, "పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యం. శరీరంలోని కణాలు అసాధారణంగా పెరగడం వల్ల డీఎన్ఏ మార్పులు, రేడియేషన్ లేదా జన్యుపరమైన కారణాలతో ఇటువంటి ట్యూమర్లు ఏర్పడతాయి. శరీరంలో ఎక్కడైనా అసాధారణ గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి బయాప్సీ వంటి పరీక్షలు చేయించుకోవాలి" అని సూచించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన జనరల్ సర్జన్ డా. ప్రేమ్ కిషోర్, అనస్థీషియా నిపుణులు డా. మహిపాల్, డా. ఇస్రత్, ఓటీ టెక్నీషియన్లు సునీల్, రాజ్‌కుమార్, స్టాఫ్ నర్సులు రాజు, పవని, ఆస్మాను సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. తమకు మెరుగైన వైద్యం అందించిన వైద్య బృందానికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.


# మియాపూర్ లో రోడ్డు ప్రమాదం, యువకుడు మృతి

**జయభేరి, హైదరాబాద్ :**

మియాపూర్ నుండి బాచుపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వి.కళ్యాణ్(22).వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో యువకుడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పరవాడలో నూకాలమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తి

**జయభేరి, పరవాడ:**



మండల కేంద్రం పరవాడలో వెలసిన నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవం ఈ నెల 18 అనగా బుధవారం కొత్త అమావాస్య పర్వదినం పురస్కరించుకుని అత్యంత వేడుకగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యినట్టు ఆలయ కమిటీ ప్రతినిదులు తెలియజేసారు. ఏటా నిర్వహించే ఈ ఉత్సవం స్థానిక ప్రజల సంస్కృతికి,ఆచారాలకు ప్రతీకగా నిలుస్తోంది. భక్తుల కొంగు బంగారంగా కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు బుధవారం తెల్లవారుజాము నుండే భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేస్తుంది.

మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్వహించి తలపెట్టిన భారీ అన్న సమారాధన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక తృప్తిని అందించనుంది. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులకు భక్తితో పాటు వినోదాన్ని కూడా పంచనున్నాయి. అమ్మవారి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించి తమ విరాళాలను అందజేయాలని కమిటీ వారు కోరారు.అమ్మవారి కృపాకటాక్షాల కోసం తరలివచ్చే భక్తులతో పరవాడ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి.

# మేడ్చల్ జిల్లాలో తాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

**జయభేరి, మేడ్చల్ :**

జీహెచ్ఎంసీ పరిధిలోని 297, 298 డివిజన్లలో మేడ్చల్, పూడూరు, కిష్టాపూర్ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సరైన పరిష్కారం చూపలేదని మండిపడ్డారు.గత తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు తాగునీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటినుంచి పట్టణ ప్రజలకు నీటి సమస్యలు మొదలయ్యాయి అన్నారు. పట్టణ చుట్టుపక్కల గ్రామాల్లో అవసరానికి మించి నీటి సరఫరా జరుగుతుంది కేవలం మేడ్చల్ పట్టణానికే ఈ సమస్య ఎందుకు వొస్తుంది అని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఖాళీ బిందెలతో పాదయాత్రగా వచ్చి అసెంబ్లీని ముట్టడిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.


# గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 16 :**

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే.రమేష్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గేదలు, ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా ఇప్పించాలని అన్నారు. గ్రామంలో 182 పశువులకు టీకాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రా రెడ్డి, డాక్టర్ రామారావు, జిఎం మహేష్, హర్ష, ఎల్ఎస్ఏ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు శంషుద్దీన్, రాఘవేంద్ర, రైతులు గుంటి మహేష్, స్వప్న పాల్గొన్నారు.


# కర్రపథకం ఆవిష్కరణ



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 16 :**

ఏప్రిల్ 6వ తేదీన నిర్వహిస్తున్న పుత్ర కామేష్టి యాగాన్ని విజయవంతం చేయాలని శ్రీ పాండురంగ ఆశ్రమం నిర్వాహకులు అప్పల సత్యనారాయణ శర్మ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పుత్ర కామేష్టి యాగము కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతానం కలగక చాలామంది దంపతులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, ఈ పుత్ర కామేష్టి యాగం వలన సంతానం కలుగుతుందని ఏప్రిల్ 6న నిర్వహిస్తున్న యాగంలో పాల్గొనాలని కోరారు.

# గ్యాస్ ధరలు తగ్గించాలి. సిపిఐ



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 16 :**

గ్యాస్ ధరలను నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తాసిల్దార్ కల్పన కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పై జరుగుతున్న యుద్ధాలపై అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ చొరవ తీసుకొని శాంతి మార్గానికి బాటలు వేయాలని, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, సామాన్య ప్రజలకు గ్యాస్ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల మాజీ కార్యదర్శి కలకుంట్ల సత్యనారాయణ, నాయకులు గుంటుపల్లి సత్తయ్య, బొట్ల భూమయ్య, పకీర నాయక్, కటకం మల్లేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

# ఉపాధి హామీని.. నిర్వీర్యం చేస్తున్న కేంద్ర సర్కార్

- పూజ్య మహాత్మా గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటు
- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి

జయభేరి, గజ్వేల్, మార్చి 16 :-



గ్రామీణ ప్రాంత కూలీలు, నిరుపేద రైతుల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి విమర్శించారు. వర్గల్, తునికి ఖల్సా, తునికి మక్త, మీనాజీపేట్, శాకారం, అంబర్ పేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలతో విధానసభలు ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్చాలనే దుర్బుద్ధితో... విబిజి రాంజీ పేరుతో కేంద్ర నిధుల్లో కోత విధించి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర సర్కార్ 40 శాతం నిధులు సమకూర్చాలని పేర్కొంటున్నట్లు ఎద్దేవా చేశారు. వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కులు, వ్యవసాయ అనుబంధ పనులు తొలగించి జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. అయితే నిరుపేద రైతులు, వ్యవసా కూలీలు, గిరిజనులు, కార్మికుల ఉపాధి కరువైన సందర్భంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చేపట్టి కడుపునిండా భోజనం పెట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలనే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఉపాధి హామీ కూలీలతో విధాన సభలు, సమావేశాలు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, సర్పంచులు, ఉప సర్పంచ్లు విజయలక్ష్మి యాదగిరి, కొండగళ్ల గణేష్, కుమార్ యాదవ్, కుమార్, గోరెమియా, టేకులపల్లి గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల లక్ష్మి, సహదేవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు పంజాల సాయి గౌడ్, నేతలు గంగుమల్ల కొండల్ రెడ్డి, నీల శ్రీనివాస్, పాషా భాయ్, యాదగిరి, పొన్నాల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఫార్మా వ్యర్థ జలాలు విడుదల నిలుపుదల చేయాలి

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్

జయభేరి, పరవాడ:

పరవాడ భరిణికం గ్రామాల మధ్య మెల్లోడు గెడ్డలోకి పరవాడ ఫార్మాసిటీ పరిశ్రమలు, రాంకీ, ఏపీఐఐసీ ఏ విధమైన జలాలను ఈ గడ్డలోకి విడుదల చేయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గెడ్డ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గత కొద్ది కాలంగా గెడ్డ పూర్తిగా ఎండిపోయి ఉండేదని సోమవారం మరోసారి జలాలను ఈ గడ్డలోకి విడుదల చేయడం పట్ల గని శెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో రాంకీ యాజమాన్యం ట్యాంకర్ల ద్వారా జలాలను తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని అయ్యిన కూడా మార్పు రావడంలేదని భవిష్యత్తులో ఈ గెడ్డలోకి ఏ విధమైన జలాలు పరిశ్రమల నుండి రాకుండా రాంకీ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు గని శెట్టి డిమాండ్ చేశారు.అలా జరగని పక్షంలో ప్రజలుచే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గని శెట్టి హెచ్చరించారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



జయభేరి, పరవాడ:

పరవాడ మండలలో రియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ లేడీస్ &బాయ్స్ హాస్టల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రియా ఫౌండేషన్ చైర్మన్ మరియు అనకాపల్లి జిల్లా డివిఎంసి సభ్యులు డాక్టర్ ఎండి రాజు విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా స్టేషనరీ సామగ్రిని అందజేస్తూ సుమారు 41 మంది పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, స్కేలు, షాప్నర్,అరేజర్, నోటుబుక్స్ వంటి అవసరమైన స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాయ్స్ హాస్టల్ వార్డెన్ రజిని, లేడీస్ హాస్టల్ వార్డెన్ సుజాత , రియా ఫౌండేషన్ సభ్యులు పైల ఈశ్వరరావు, రెడ్డి రాధాకృష్ణ , జోరేగల ప్రేమ్ కుమార్,జోరేగల గౌతమి, అఖిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,

## శ్రీశ్రీశ్రీ కుర్మేడు ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్ వారు మాట్లాడుతూ ఎంతొ కన్నులపండువగా నిర్వహించే ఈ జాతర మహోత్సవం లో పాల్గోనడం శుభ పరిణామం అని అమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా మెలగాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ చెన్నమ్మ లాలయ్య, మాజీ MPtc కుంభం శ్వేత శ్రీశైలం గౌడ్,అండేకార్ అశోక్,సాగర్ రావు,నాదిరి రమేష్, కేతావత్ కిషన్ నాయక్,బీమయ్య, శ్రీకాంత్,నాదిరి శ్రీశైలం, జైపాల్ నాయక్,మోతిరాం,చిన్ను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు




జయభేరి, దేవరకొండ :

వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ పున్నా శైలజ వెంకటేశ్వర్లు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ విచ్చేసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కళ్యాణమండపం అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ అధ్యక్షులు పందిరి వెంకన్న జ్యోతి డిస్టిక్ జాయింట్ ట్రెజరర్ ర్ ఆలంపల్లి పద్మ నీలా సంజీవకుమార్ వాసవి వనిత క్లబ్ కోశాధికారి ఆలంపల్లి శిరీష వాసవి క్లబ్ కార్యదర్శి బెలిదే రవీందర్ ఆలంపల్లి మురళి ఐపీసీ లకుమారపు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాలలో మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా మధ్యాహ్నం 3గంటలకు కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అనంతరం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రారంభోత్సవాల్లో కూడా పాల్గొంటారు. అలాగే సాయంత్రం 5గంటలకు క్యూఆర్ ఫంక్షన్ హాల్ లో రంజాన్ తోఫా పంపిణీ అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. కావున ఈ కార్యక్రమాలలో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ ఛైర్మెన్, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవదళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## మున్నూరు బాలరాజుకు ఘన సన్మానం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మున్నూరు బాలరాజు పుట్టిన రోజు వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ముడా అధ్యక్షులు కర్ణం రాజు, డాక్టర్ ఉస్కిల్ల వెంకట్రాములు (తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంగం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు) సత్యం సాగర్, బేకరీ సంతోష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బడంగ్ పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

జయభేరి, రంగారెడ్డి :

బడంగ్పేట్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఏసీబీ హైదరాబాద్ రేంజ్ టు డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్ప్రైజ్ చెకింగ్ జరిగింది. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై దాడులు జరిపారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

## హామీలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ

- ఎమ్మార్వో రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

జయభేరి, గజ్వేల్, మార్చి 16 :



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్మెంట్, రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలను గాలికొదిలేసి ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర జిల్లా శాఖ పిలుపు మేరకు మెదక్ ఎంపీ వర్యులు రఘునందన్ రావు సూచన మేరకు బీజేపీ వర్గల్ మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డీ ఆధ్వర్యంలో వర్గల్ మండల ఎమ్మార్వో రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులు,విద్యార్థులు, మహిళల ఆక్రోశానికి అద్దం పడుతూ.. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి సమర శంఖం పూరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు రామాంజనేయులు చిరంజివి వెంకటేష్ బూత్ అధ్యక్షులు బద్రీనాథ్ సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి నాగరాజు గౌడ్ మఠంమహిపాల్ బబ్బూరి రవీందర్ శంకర్ గౌడ్ బర్కంనాగరాజు నరేందర్ రెడ్డి బన్నీ రెడ్డి పారశురాం గౌడ్ మహేందర్ గౌడ్ కాశీ వెంకటేష్ పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ కోర్సులపై మహిళలకు అవగాహన కార్యక్రమం

జయభేరి, పరవాడ:



అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలోని (వాడచీపురుపల్లి - 2) అంగన్వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 16 రోజుల కార్యక్రమంలో భాగంగా మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ నెల 2వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుగుతున్న కార్యక్రమాల నేపథ్యంలో డ్వాక్రా మహిళలు మరియు గ్రామ మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీలు మరియు పురుషులకు అనకాపల్లి జిల్లా సంకరంలో వివిధ స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో బ్యూటీషియన్, కంప్యూటర్ తదితర కోర్సులు ఇవ్వబడుతున్నాయని చెప్పారు. గ్రామాలలో ఉన్న యువతీ, యువకులకు ఈ అవకాశాలపై అవగాహన కల్పించి, ఎక్కువ మంది ఈ కోర్సుల్లో చేరేలా చూడాలని మహిళలకు సూచించారు. అలాగే డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు క్రమంగా పొదుపు చేసుకోవాలని, ఈ పొదుపులు భవిష్యత్తులో అవసరమైనప్పుడు ఉపయోగపడతాయని తెలిపారు. పొదుపు అలవాటు వల్ల కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కూడా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాడచీపురుపల్లి సెక్టర్ సూపర్వైజర్ హెచ్.వి. రమణి గారు, డ్వాక్రా మహిళలు, ఎస్ఏజి సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణలో స్ఫూర్తి ప్రదాత నందనంపాటి రాముకు ఘనంగా సత్కారం

జయభేరి, కుషాయిగూడ :



సమాజంలోని పేదలు, భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భావాన్ని చాటుతున్న ఈసీఐఎల్ లోని సోలిస్ ఐ కేర్ సిఎండి, తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ నందనంపాటి రాము నిజమైన సేవా స్ఫూర్తి ప్రదాత అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అభినందించారు. సోమవారం ఈసీఐఎల్లోని సోలిస్ ఐ కేర్ హాస్పిటల్లో "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు అందుకున్న నందనంపాటి రాము అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నందనంపాటి రాము సమాజంలో సేవా కార్యక్రమాలకు ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇందులో భాగంగా పాండిచ్చేరి లోని తిరునల్లార్ లోని ప్రసిద్ధ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన శని పేర్చి పవిత్ర ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్, సోలిస్ హాస్పిటల్ చైర్మన్ నందనపాటి రాము ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఐదవ సారి ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయ 27వ పీఠాధిపతి మహా సన్నిధానం శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ చేతుల మీదుగా నందనంపాటి రాముకు "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పేదలు, అవసరమైన వారికి అన్నప్రసాద వితరణ చేయడం ద్వారా ఆయన మానవతా విలువలను చాటుతున్నారని పేర్కొన్నారు. సమాజ సేవలో ఆయన చేస్తున్న కృషికి ఎన్ని అవార్డులు ఇచ్చినా తక్కువేనని వారు అన్నారు. అలాగే భక్తి భావంతో, సమాజం పట్ల బాధ్యతతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, సోలీస్ ఐ కేర్ సిబ్బంది విజయేందర్ రెడ్డి, మహేష్, విజయలక్ష్మి, భాస్కర్, గజేందర్, మోహన్, నీరజ తదితరులు పాల్గొని నందనంపాటి రామును అభినందించారు.

# దేవరకద్రలో పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- ప్రజా పాలనలో భాగంగా "అరైవ్.. ఆ లైవ్"
- ఎస్ ఐ నాగన్న ఆధ్వర్యంలో తనిఖీలు

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం రాత్రి స్థానిక పోలీసులు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "అర్రైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్ ఐ నాగన్న తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగినదని తెలిపారు. ఈ సందర్భంగా దేవరకద్ర పోలీస్ స్టేషన్ పరిధిలో తన సిబ్బందితో కలిసి దేవరకద్ర పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, దీని వల్ల ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టం కలగవచ్చని తెలిపారు. కాబట్టి ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. అదేవిధంగా మాదకద్రవ్యాల రవాణా, విక్రయం మరియు వినియోగం పూర్తిగా నిషేధితమని, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజాన్ని మాదకద్రవ్యాల నుండి దూరంగా ఉంచేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంలో భాగస్వాములు కావాలని ఎస్ ఐ నాగన్న విజ్ఞప్తి చేశారు.



## పైడితల్లమ్మ అమ్మవారి నెల పండగ సందర్భంగా భారీ అన్నసమారాధన

**జయభేరి, పరవాడ:**

పరవాడ గ్రామ ఇలావేల్పు పైడితల్లి అమ్మవారి నెల పండగ మార్చి 17 అనగా మంగళవారం నాడు అమ్మవారి ఆలయం లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అలాగే అమ్మవారి ఆలయం వద్ద దాతలు సహకారంతో ఉదయం 11:00 నుంచి భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది నిర్వాహకులు తెలియజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదం స్వీకరించాలని కోరారు.

# విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌లో పరవాడ పోలీస్ శాఖ సోమవారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పరవాడ ఎస్ఐ బి కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు ముఖ్యంగా మాదకద్రవ్యాలు మరియు గంజాయి వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు పై విద్యార్థులు అందరూ అవగాహనతో ఉండాలని తెలిపారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా భవిష్యత్తుకు కూడా తీవ్రమైన నష్టం కలిగిస్తుందని, అలాంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు చట్టపరంగా శిక్షార్హమని కూడా వివరించారు.అలాగే విద్యార్థులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, గురువులను గౌరవించడం, చదువుపై దృష్టి పెట్టడం వంటి అంశాలపై కూడా సూచనలు ఇచ్చారు. భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి చెడు స్నేహితుల ప్రభావానికి లోనుకాకుండా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పోలీసులతో పరస్పరంగా మాట్లాడారు. పరవాడ పోలీసులు యువతలో చట్టపరమైన అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెడ్ మాస్టర్ ఎం. అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం కొత్త మొల్గరలో సోమవారం రిజ్వాన గౌస్ ఆజాం యొక్క ఇందిరమ్మ ఇంటిని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి కవిత రెడ్డి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి యజమానులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కె నిఖిత బీకాం సెకండ్ ఇయర్ హ్యాండ్ బాల్ గేమ్ లో విజయం



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల సౌత్ జోన్ అండ్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ (ఉమెన్స్) champion 20252026 మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటలలో మన తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల నుండి కె నిఖిత( బీకాం సెకండ్ ఇయర్ ) హ్యాండ్ బాల్ గేమ్ ఆటలలో విజయాన్ని చేజిక్కించుకుంది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ , అధ్యాపక బృందం, జీ. మహేశ్వరి ఫిజికల్ డైరెక్టర్ అభినందించినారు.

## గ్రామపంచాయతీ కార్మికులను సన్మానించిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 16 :**

తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులను సర్పంచ్ దోనికేన రేణుక వెంకటేష్ యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతిరోజు పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమై గ్రామానికి సేవలను అందిస్తున్న కార్మికులను సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూకల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు వంగ కరుణాకర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్

- రాహుల్ బంధు కాదు.. రైతుబంధు కావాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**




బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. సహచర ఎమ్మెల్యే లతో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించిన బీఆర్ఎస్ నాయకులు. "రైతులకు వెన్నుపోటు, రాహుల్‌కు ₹ 1000 కోట్లు".. "రాహుల్ బంధు కాదు, రైతుబంధు కావాలి".. "పెన్షన్లు పెంచే మాట మరిచారు, పేదవాళ్ల నడ్డి విరిచారు".. "మహాలక్ష్మి పథకం మాట మరిచారు, మహిళలను నట్టేట ముంచారు" అంటూ నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



## బాలరాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో సోమవారం దేవరకద్ర పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాలరాజు జన్మదిన వేడుకల్లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాలరాజుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బాలరాజు కు స్వీట్ తినిపించి, ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.


## నేడు దేవరకద్రకు ఎమ్మెల్యే జిఎంఆర్ రాక



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ దేవరకద్ర నియోజకవర్గం కేంద్రానికి మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూనేటి అంజిల్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 11 గంటలకు స్థానిక మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు. అలాగే ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. కావున ఈ కార్యక్రమానికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులతో పాటు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని అంజిల్ రెడ్డి కోరారు.

## కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# శిక్షణ కార్యక్రమానికి హాజరైన బస్వాయిపల్లి పంచాయతీ వార్డు సభ్యులు

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో బస్వాయపల్లి పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాయపల్లి గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్, కార్యదర్శి రామ చంద్రయ్య, వార్డు సభ్యులు గంగమోని రాధ, మమత, పద్మమ్మ, కురువరాజు, రవికుమార్ లు పాల్గొన్నారు.

